క్లుప్తంగా

రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న తెలగంశెట్టి సత్యనారాయణ

నరసాపురం: అంగన్‌వాడీ, ఆశ కాంట్రాక్ట్ ఉద్యోగులకు రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం సీఐటీయూ మండల మహాసభ స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. కార్మికులను బానిసలుగా ప్రభుత్వం చూస్తుందని అన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కవురు నర్సింహస్వామి, చింతా రాజారెడ్డి, రావూరి మాణిక్యాలరావు, పులపర్తి రత్నకుమారి పాల్గొన్నారు.

కుక్కల బెడదతో అవస్థలు



మేదర్ల వంతెన వద్ద రోడ్డుపై ఉన్న కుక్కలు

నరసాపురం: పట్టణంలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఏ వీధిలో చూసినా కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రోడ్డుపై నడవాలంటే జనం భయపడే పరిస్థితి నెలకొంది. ఎక్కడపడితే అక్కడ కుక్కలు దాడి చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు కుక్కల నిర్మూలనకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు అన్ని వార్డుల్లోను ఈ సమస్య అలాగే ఉంది. ప్రజలు ప్రతిరోజూ కుక్కల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. కానీ మున్సిపల్ అధికారులు ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. కుక్కల నిర్మూలనుకు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ధ్యాన శిక్షణ తరగతులు



భీమవరంలో ధ్యాన శిక్షణ తరగతులను నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయ విశ్రాంత మందిరంలో మూడు రోజులపాటు నిర్వహించిన ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు భీమవరం శాఖ నిర్వాహకుడు కలిగొట్ల గోపాలశర్మ చెప్పారు. ఈ మేరకు శనివారం శిక్షణను ప్రారంభించారు. ఈ తరగతుల్లో ధ్యానంతో పాటు అడ్వాన్స్‌డ్ మెడిటేషన్ క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. నేటి సమాజంలో యాంత్రిక జీవనంతో పాటు, ఒత్తిడితో కూడిన పనులను అధిగమించాలంటే మెడిటేషన్ ద్వారా సాధ్యమన్నారు. కార్యక్రమంలో దండు దుర్గాదేవి, ఉమాదేవి, నర్సింహరాజు, నారాయణరాజు, రమేష్, భవాని, ఎంఈఓ సాయిరాం, కేవీ సుబ్బరాజు, గంధం శ్రీదేవి, అల్లు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాలకొల్లు సెంట్రల్: రెండు రోజులు క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చింతపర్రులో చోటు చేసుకుంది. ఈ నెల 9న చింతపర్రు రైల్వే గేటు సమీపంలో ఉప్పు దుర్గారావు (61) అనే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రుడిని పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుని కుమారుడు విజయకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

వీరవాసరం: భీమవరం ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్ పోలీసులు మండలంలో శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నౌడూరు గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న కొణితవాడకు చెందిన ఎ.రామకృష్ణ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 6 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్సై పి.ఉమా మహేశ్వర రావు, పి.సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని భీమవరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇనెస్పెక్టర్ కె.బలరామరాజు తెలియజేశారు.

తూడుతో పంటలకు తూట్లు

- పంట కాలువల్లో పేరుకుపోతున్న తూడు
- తూడు తొలగింపుపై దృష్టి పెట్టని వైనం



దర్బరేవు డ్రెయిన్‌లో భారీగా పెరిగిన తూడు, కిక్కిస



చామకూరిపాలెంలో సాగు చేయకుండా వదిలేసిన చేలు

నరసాపురం రూరల్: నియోజకవర్గంలోని పంట కాలువలు, మురుగు డ్రెయిన్లు తవ్వకపోవడంతో గుర్రపుడెక్క పేరుకుపోయి నీటి ప్రవాహానికి అవరోధంగా మారింది. ఫలితంగా సాగు, మురుగు నీరు సరిగ్గా పారకపోవడతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్నా, ఇరిగేషన్ మంత్రి నరసాపురం పక్క నియోజకవర్గం పాలకొల్లుకు చెందిన వారైనప్పటికీ తూడు తొలగింపుపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. ముఖ్యంగా ధర్బరేవు డ్రెయిన్ ఇబ్బంది వల్ల పసలదీవి గ్రామంలోని ఎక్కువమంది రైతులు ఊడ్పులు ఊడ్చడం మానేశారు. నీటి సంఘాలు, వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీలు అక్కడక్కడా పంట కాలువలు, డ్రెయిన్లు తూతూ మంత్రంగా పనులు చేశారు. అయినప్పటికీ సమస్య శాశ్వతంగా పరిష్కారం కాలేదు. దీంతో రైతులు వర్షం వస్తే వరి చేలు ముంపుబారిన పడుతున్నాయని, ఎండకాస్తే పొలాలకు సాగు నీరు సరిగా అందడంలేదని ఆవేదన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి

సరిపల్లి, రుస్తుంబాద, ధర్బరేవు తదితర డ్రెయిన్లు, వేములదీవి ఛానల్, సరిపల్లి కాలువ తదితర పంటకాలువలతో పాటు నరసాపురం ప్రధాన పంట కాలువలలో కూడా గుర్రపుడెక్క పెద్ద ఎత్తున పేరుకుపోయింది. పసలదీవి ప్రాంత రైతులు గ్రామంలోనూ, సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఇటీవల కాలంలో ఆందోళనలు చేశారు. సమస్య పరిష్కరించాలని ప్రజా ప్రతినిధి ఆదేశించడంతో అధికారులు మొక్కుబడిగా సమస్య గుర్తించే పనిలో రెండు రోజులు డ్రైన్ల గట్లమీద తిరిగారు. అయితే నేటికీ ఈ డ్రెయిన్లలోని గుర్రపుడెక్క తీయక పోవడంతో నీటి ప్రవాహ ఉధృతి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చామకూరి పాలెం గ్రామంలో కొంతమంది రైతులు పొలాలు ఊడ్చడం మానేశారు. నరసాపురం నుంచి వేములదీవి వెళ్లే పంట కాలువ పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ఈ ఛానల్ నుంచే లక్ష్మణేశ్వరం మంచినీటి చెరువుకు నీరు తోడతారు. ఈ ఛానల్‌మీదే రాజుల్లంక, లక్ష్మణేశ్వరం, మర్రితిప్ప, ధర్బరేవు, వేములదీవి, బియ్యపుతిప్ప తదితర గ్రామాల ప్రజల సాగు, తాగు నీరుకు ఇదే ఆధారం. ఇంత ప్రాధాన్యత కలిగిన పంట కాలువలు, మురుగు డ్రెయిన్లను తవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రైతులు, ప్రజలు నానా అగచాట్లు పడతున్నారు. జిల్లా అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్య తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని నియోజకవర్గంలోని రైతులు కోరుతున్నారు.



గుర్రపు డెక్కతో నిండిన సరిపల్లి పంట కాలువ.



వేములదీవి ఛానల్‌లో ఏపుగా పెరిగిన తూడు



తూర్పుతాళ్ళు చామకూరి పాలెం చానల్‌లో పేరుకుపోయిన తూడు

నేడు హాలో బీసీ... చలో పాలకొల్లు

పాలకొల్లు సెంట్రల్: స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నా బడుగు బలహీన వర్గాల జీవన విధానం ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవానీ అన్నారు. శనివారం గణేష్ భవానీ విలేకరులతో మాట్లాడుతూ బీసీ కులాల అభివృద్ధి కోసం, బీసీ రిజర్వేషన్లు అమలు కోసం ఆదివారం పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో 139 కులాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి బీసీ కులాలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు.

పీఏసీసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

నరసాపురం రూరల్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం మొగల్తూరు మండలం మొగల్తూరు పీఏసీసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ సీకారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా నిప్పులేటి తారకరామారావు, సభ్యులుగా కవురు నాగేశ్వరరావు, మైలాబత్తుల రాంబాబులు ప్రమాణ స్వీకారం చేశారు.

క్షీరారామలింగేశ్వరుని ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయం నూతన పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా మీసాల రామచంద్రరావు, ట్రస్ట్ బోర్డు సభ్యులుగా మరో పది మంది ప్రమాణస్వీకారం చేశారు. నూతన కమిటీ సభ్యులతో మంత్రి నిమ్మల రామానాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమంలో రాజకీయ ఉపన్యాసాలు చేస్తూ ఆలయ ప్రధానార్చకులు, ఆలయ ఎక్స్‌అఫీషియో సభ్యుడైన సన్నిధిరాజు రామకృష్ణమూర్తిని (కిష్టప్ప) సభా వేదికపైకి పిలవడం మర్చిపోయారు. ఇంతలో మీడియా సభ్యులు గుర్తు చేయడంతో చివరి నిమిషంలో కిష్టప్పను వేదిక పైకి పిలిపించి ప్రమాణ స్వీకారం చేయించారు.

పౌష్టికాహారం పంపిణీ

భీమవరం: స్థానిక మానవత సంస్థ ఆధ్వర్యంలో భీమవరం ప్రభుత్వాసుపత్రి ఏఆర్టీ సెంటర్‌లో శనివారం హెచ్ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతిరాజు, అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రతి నెలా రెండో శనివారం హెచ్ఐవీ కుటుంబాల పిల్లలకు ప్రభుత్వం అందించే మందులతో పాటు సంస్థ సభ్యుల సహకారంతో క్రమం తప్పకుండా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.గోవిందబాబు, సంస్థ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు అల్లు శ్రీనివాస్, కారుమూరి నర్సింహమూర్తి బాబు, ఎస్ఎస్ఎన్ రాజు, గ్రంధి కుమార వెంకటేశ్వర వరప్రసాద్, చేకూరి ఝాన్సీ పాల్గొన్నారు.

వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు



నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడప వేంకటేశ్వరస్వామిని ఆలయంలో శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజామునే స్వామి వారికి విశేష సేవలు చేసి అభిషేకాలు, పూజలు చేశారు. ప్రసాద వియోగం, సేవలు చేయడంతోపాటు ఆలయ అర్చకులు పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రూపచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అక్రమార్కుల చేతికి కోడేరు ఇసుక

పెనుగొండ: ఆచంట మండలంలో కోడేరులో లభించే ఇసుక ఆదాయం అక్రమార్కుల పాలైందని వైఎస్సార్ సీపీ మండల కమిటీ కన్వీనరు జక్కంశెట్టి చంటి తెలిపారు. శనివారం కోడేరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కోడేరులో ఇసుకను అక్రమంగా తరలించుకుపోయారని ఆరోపించారు. గతంలో ఇసుక ద్వారా వచ్చే ఆదాయంతో కోడేరు గ్రామాభివృద్ధికి సహకరించేవారన్నారు. ప్రస్తుతం టీడీపీ తినుకో దోచుకో..పంచుకో అనే రీతిలో స్థానిక ఉన్నత ప్రజా ప్రతినిధితో పాటు గ్రామంలోని టీడీపీ నాయకులు ఇసుకను దోచేసుకున్నారని విమర్శించారు. కూటమి నాయకుల అరాచక పాలనకు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మామిడిశెట్టి సుబ్రహ్మణ్యాన్ని నియమించినట్లు పేర్కొన్నారు. అలాగే యువజన విభాగం అధ్యక్షుడిగా లంకపల్లి సుందరరాజు, రైతు విభాగం అధ్యక్షుడిగా మేడిది రెడ్డియ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కోట భాస్కరరావు, బీసీ సెల్ అధ్యక్షుడిగా మామిడిశెట్టి త్రిమూర్తులు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మైలే రాధలతో పాటు, 20 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముత్యాల నాగేశ్వరరావు, దేవరపు సూర్యనారాయణ, పమ్మి సురేష్, కొమ్ముల రాంబాబు, సరిపల్లి వెంకటరత్నం, కుసుమే పెద్దిరాజు, కట్టా గణపతిరావు, బొంతు శ్రీను, మేడిది జయ, కోట ప్రసాద్, యల్లమెల్లి నాగేశ్వరరావు, సరేళ్ల మోహనరావు, సరిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మామిడిశెట్టి సుబ్రహ్మణ్యాన్ని అభినందిస్తున్న నాయకులు

లింగ అసమానతలపై అవగాహనతో ఉండాలి

పెనుగొండ: ప్రపంచవ్యాప్తంగా బాలికలు ఎదుర్కొంటున్న లింగ అసమానతలపై ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ వి.ప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. విద్య పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ హింస, బలవంతపు బాల్యవివాహాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. బాలికలు, యువతలు వారి వారి రంగాలలో పరిశోధనలకు సంబంధించి సాధించిన అభివృద్ధిని తెలియపరచి వారిలో స్ఫూర్తిని నింపాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కేబీకేఎస్ రమేష్ రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి జె.సత్యనారాయణ, పీహెచ్ఎన్ ఎస్.మీరమ్మ, సీహెచ్ఓ వై.వీరమ్మ, హెచ్‌సీహెచ్ పద్మజ, ఏఎన్ఎంలు శ్రీదేవి, శేషారత్నం, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



పోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పేదలకు వైద్య విద్య దూరం చేయడం దారుణం

వీరవాసరం: పేదలకు వైద్య విద్యను దూరం చేసేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమని భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చినమిల్లి వెంకటరాయుడు మండిపడ్డారు. మండలంలోని నెలపోగుల, కొంతివాడ గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చినమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేద ప్రజలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం చర్యలను నిరసిస్తూ మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు కోటి సంతకాల సేకరణ చేపట్టామని, దీనిలో భాగంగా నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో రచ్చబండ నిర్వహించి, కూటమి వైఫల్యాలను, ప్రజలను చేస్తున్న మోసంపై వివరిస్తూ సంతకాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భీమవరం మండల నాయకులు గాదిరాజు రామరాజు, వీరవాసరం మండల అధ్యక్షులు చవ్వాకుల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు నాగరాజు శ్రీనివాస్‌రాజు, పిల్లివీరేశ్వరరావు, నాగరాజు, వెంకట గోపాలకృష్ణరాజు, కాండ్రేకుల శ్రీనివాస్ తదిరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చినమిల్లి వెంకటరాయుడు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): మొక్కలను ఇళ్లలోను తోటల్లోనూ కాకుండా ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా పెంచాలని, తపాల శాఖ కార్యాలయంలో సమృద్ధిగా పెంచడానికి ప్రణాళిక చేశామని భీమవరం పోస్టల్ హెడ్ పోస్ట్ మాస్టర్ పి.రాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, తపాల శాఖ ఆధ్వర్యంలో భీమవరం పోస్టల్ కార్యాలయంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వాన్ని ఆశ్రయించి వచ్చే వారికి మనం పెంచిన మొక్కలు పెద్దవై నీడనిస్తాయన్నారు. అనంతరం రంగసాయి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఒక్క మొక్కనైనా నాటాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ లీడర్ లెనిన్ బాబు, పీఆర్వో భాస్కర్ రాజు, అసిస్టెంట్ హెడ్ పోస్ట్ మాస్టర్ శ్రీనివాసరావు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, తాడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరం హెడ్‌పోస్టాఫీసులో మొక్కలు నాటుతున్న దృశ్యం

రైతుల అభ్యున్నతి, దేశ ఆహార భద్రతే లక్ష్యం

ఉండి: రైతుల అభ్యున్నతి, దేశ ఆహార భద్రతేలక్ష్యంగా కేంద్రంలోని ప్రధన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం పనిచేస్తుందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో పీఎండీడీకేవై పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ పత్యక్ష ప్రచారాన్ని వీక్షించారు. అనంతరం జరిగిన సభలో వర్మ మాట్లాడుతూ నూతన ఆహారోత్పత్తుల ద్వారా రైతుల ఆదాయాన్ని వృద్ధి చేయాలనే లక్ష్యంతో ధన్ ధాన్య మిషన్, ప్రకృతి వ్యవసాయ మిషన్, పప్పుధాన్యలలో స్వయం సమృద్ధిసాధనకు ఆత్మ నిర్భరతా మిషన్, వంటనూనెలు, నూనె గింజల మిషన్ వంటి పథకాల్ని ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం ఎమ్మెల్యే పీ.రామాంజనేయులు, జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వర్లు, ఎన్.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

భీమవరం: సమాజ దేవాలయానికి నిజమైన రక్షకుడు ఉపాధ్యాయులేనని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాలలో శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ భీమవరం డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో వారు 45 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో డీఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, సుంకర మాణిక్యాలరావు, ఎం.జనార్ధన్, వి.సుబ్రహ్మణ్యరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

భీమవరం: రాత్రి వేళల్లో ఎక్కువగా మాంసాహారం తినడం ఆరోగ్యానికి మంచిది కాదని మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని ఆయుర్వేద వైద్యుడు యశ్వంత్ సాయి అన్నారు. స్థానిక చరక సంజీవిని కేరళ ఆయుర్వేద పంచకర్మ సెంటర్‌లో శనివారం ఆరోగ్యంపై ఆయుర్వేద అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కంటే ఆయుర్వేదంపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. అనంతరం రోగులకు మూల శంఖ (పైల్స్), రక్త మొలలు, మలమార్గంలో నొప్పి, మలబద్ధకం, ఫిస్టుల్లా, ఫిషర్ వంటి సమస్యలపై ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

వ్యక్తిపై కేసు నమోదు

అత్తిలి: మండలంలోని ఆరవల్లి గ్రామంలో కావలిపురపు విజయ్‌కృష్ణ అనే వ్యక్తిపై కొల్లపర్తి పవన్ కుమార్ అనే వ్యక్తి ఇంట్లో చొరబడి గాయపరిచాడనే ఆరోపణపై పవన్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు అత్తిలి ఎస్సై పి. ప్రేమరాజు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ గ్రామానికి చెందిన విజయ్‌కృష్ణ అత్తవారింట్లో ఉండగా దిరిసుమర్రు గ్రామానికి చెందిన పవన్ కుమార్ ఇంట్లో చొరబడి కొట్టడంతో విజయ్ కృష్ణ గాయపడటంతో చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడని, ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు పవన్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

విజయవాడ ధర్నాచౌక్‌లో ఎంటీఎస్ టీచర్స్ నిరసన

తణుకు అర్బన్: మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్స్‌ను రెగ్యులర్ చేయాలని, మినిమమ్ పెన్షన్ కల్పించాలనే ప్రధాన డిమాండ్స్‌తో శనివారం విజయవాడ ధర్నాచౌక్‌లో నిరసన తెలిపినట్లు ఎంటీఎస్ టీచర్స్ తెలిపారు. సుమారుగా రెండు వేల మందితో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల నుంచి పాల్గొన్నట్లుగా టీచర్స్ పాలంకి రామ బ్రహ్మ పతంజలి, కస్తూరి రఘుపతిరావు, పి. బెనర్జి, మంతెన శ్రీరామరాజు, కొండవీటి మోహనరావు, కొణతల నాగేంద్రప్రసాద్ తెలిపారు.

ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో నిరసన

తణుకు అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ తణుకు డిపోలో యాజమాన్యం కొత్తగా పెట్టిన హార్డ్ డ్యూటీ రెస్టాఫ్‌లు, తణుకు ఆర్టీసీ డిపో డ్రైవర్ జి.రామారావుపై అక్రమ సస్పెన్షన్‌లపై నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయుఏ) ఆధ్వర్యంలో డిపో ఆవరణలో గేట్ మీటింగ్ ధర్నా నిర్వహించారు. ఇదే సమస్యలపై గత రెండు రోజులుగా ఎన్ఎంయుఏ ఆధ్వర్యంలో రెడ్ బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. రెండు రోజుల గేట్ మీటింగ్ ధర్నాలకు యూనియన్ పిలుపునిచ్చినట్లు ఎన్ఎంయుఏ అధ్యక్షుడు ఎస్.ఏసుబాబు చెప్పారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగా, ధ్యానంతో మానసిక ఆందోళనకు దూరంగా ఉండవచ్చునని యోగా గురువులు కరిబండి రామకృష్ణ, బడుగు చంద్రశేఖర్‌లు అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో స్థానిక గుణ్ణం ఫంక్షన్ హాల్, ఉమర్ ఆలీషా పీఠంలో ప్రత్యేక ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానంపై అవగాహన కల్పించారు.